# అంతర్వాహిని

శ్రీ
కందుకూరి లింగరాజు

"నువ్వు రణపెంకివి; రాలుగాయివి అయిపోతున్నావు"

"ప్రపంచంలో ఎటువంటి శాంతమూర్తయిన మగాడు కూడా, నీ కాల్చుకుతినడం ముందర ఆగలేడు".

"ఏదో అంటే ముట్టనట్లుగా సంసారం నెట్టుకు వస్తున్నాను కాని, నీలాంటిమనిషిని పెళ్ళాడి, ఇంకొకడైతే, ఈపాటికి జంధ్యాలు తెంపి సన్యాసుల్లో కలసిపోయేవాడు"

ఈ వరసలో గత మాసం పైనుండీ పరుశురామయ్య అంటూఉండడం, అదీ సమయా సమయాలు లేకుండా, అనేసి పేరాకోళం అన్నట్లు నవ్వేయ్యడం జరుగుతూనే వుంది. ఇల్లాంటివి విన్నప్పుడల్లా లలితమ్మకు ఉడికేసు కున్నట్లు వుండేది. తన్ని సంపుటీకరించుకుంటే, ఇద మిద్ధంగా తను మారిన విషయం ఏమీ కన్పించటంలేదు. అల్లాంటప్పుడు, ఆయన ఎత్తి పొడవటంలో సందర్భ శుద్ధి కన్పించటం లేదు.

ఆ మొట్ట మొదటి రోజులు జ్ఞాపకంగా తిరిగేవి. అప్పుడు కళ్ళల్లోకి చూస్తూనే ప్రపంచాన్ని మరచిపోయానని, రాత్రీ, పగలూ, దినాలూ, వారాలూకూడా తను ఎదురుగా కూర్చుంటే, తెలియకుండానే గడిచిపోతాయని, చెవులో రహస్యంగా రామనామస్మరణ చేసే ఆయన, ఈ గత కొన్ని రోజులనుండీ ఇంత కఠినంగా ద్వేషంతో తనెదురుగ్గానే అనెయ్యడం హృదయాన్ని తోడేసినట్లయ్యేది.

ఇంట్లోకూడా, ఐదేళ్ళ సంసారం నడిచినా ఇంకొకళ్ళు లేక పోవడం వల్ల తను, ఆయన అన్నదే సంసారం క్రింద జమవేసి పూర్ణంగా ఆయనకొరకు కేంద్రీకరించింది. ఆరాధనాకల్ల చేసుకుంది. ఇంత త్యాగం చేసినా ఆరాధన అన్నదాని క్రింద విచిత్ర రకరకాల పరిస్థితులు అనురాగంలో వొనర్చినా, కృతజ్ఞత లేకుండా, ఈసడింపు మాటలు అనడం మనస్సును విరిచేసింది,

ఒక్కొక్కసారి ఎదుట నిలబెట్టి అడుగుదామని ఆయత్తత కల్గేది. తీరా అడిగితే ఏం రాద్ధాంతాలు లేచి, అన్నం తినడం మానేసి, రాత్రల్లా ఎడతెగకుండా సిగరెట్లు కాలుస్తూ కూర్చుంటారని భయపడి అడగలేక పోయింది. ప్రతిరోజూ 'సిగరెట్లు కాల్చకండి' అని తనుపోరు పెట్టడం వల్లనే, ప్రతీకారంలో ఇల్లామారితే, మానేస్తుందన్న భావనలో మొదలు పెట్టేరేమో అన్నదీ తట్టింది. కాని ఇంత అల్ప విషయానికి అంత కఠినత్వం వహిస్తారన్నది, తొడుక్కొని కోటులా వుంది.

ఆ రోజుల్లో పత్రికల్లో ప్రచురించిన ఆయన కథలు చదివేది, ప్రతీకథలోనూ కన్ని ఏదో పేరుతో, ఎత్తి పొడవడమో న్యూనపరచడమో, కన్పించింది. ఆనాటి కథలకు ఈనాటి మాటలకు నిర్దిష్టంగా తేడా కన్పిస్తూనే వుంది. ఒక్కొక్క కథ చదివినప్పుడు, ఆయన దృష్టిలో తను ఎంత నీచస్థితిలో వుందో అని తట్టినప్పుడల్లా, ఇంకెందుకు జీవించడం, అనురాగం అధఃపాతాళాన్కి వెళ్ళినప్పుడుఅన్న ఉద్రేకమూ వచ్చేది. జీవితంమీద విరక్తిలోతా కల్గి ఏ అఘాయిత్యాపువనికేనా ప్రోత్సహించడంకూడా జరిగేది. కాని అది పిరికితనం యాపాందించుకోలేక పోయేది

మళ్ళీ ఎప్పటికైనా తనదారిలోకివచ్చి, సముదాయింపు కల్గదా అన్న ఆశను వదులుకోలేక వుండి పోయింది లలితమ్మ.

ఆరోజు ఆకాశంనీలిరంగుతో, ఎడంవైపు పైగా గులాబీముద్రతో, ముత్యాలాపేరులాంటి ఎద్రసు వ్రాతతో కవరు వచ్చింది. కవరు చూచేసరికి అనుమానం కల్గింది, ఇదే పెద్దదయి, ఉత్తరం చింపి చదవాలన్న ఉద్రిక్తతా కల్గింది. మడతలు విప్పుతుంటే చక్కని సెంటువాసన వేసింది. దాంతో అనుమానం గుబాళించి ఉక్కిరి బిక్కిరి. చేసేసింది. "నేను కాకుండా, నావెనుక ఆయనకు...." తట్టుకోలేకపోయింది.

ప్రియమైన.... .... .... .... .... ....

మీ ఉత్తరం.

చాలాకాలం నుంచి మిమ్మల్ని చూడాలన్న కోర్కె పెరుగుతూనేవుంది. కనీసం మీరు పంపిన ఫొటోకు కృతజ్ఞురాల్ని.

గత కొన్ని నెలల నుండీ మీ కథల్లో మీ హృదయం సంసారంలో ఎంత సుఖం లేకుండా వేగిపోతోందో అన్నది నన్ను చాలా ఆర్ద్రం చేస్తోంది. కళ్ళమ్మట నీళ్ళు తెప్పిస్తున్నాయి.

ఒకొరి కొకరు, సంపూర్ణత్యాగం చేస్తేనే కాని సంసారం నడవదు అని ఎలుగెత్తి చాటినా, మీ భార్య ఆవిడ మూర్ఖత్వం ఎందుకు మిమ్మల్ని ఈవిధంగా హింసిస్తోందో అర్థం కావటంలేదు. ఆవిడ ఏ పెద్దపులో బ్రహ్మరాక్షసో అయివుంటుందని, మానవత్వం పూర్తిగా పోగొట్టుకున్న వ్యక్తి క్రింద తడుతోంది.

దీనికి నా హృదయపూర్వక సానుభూతి.

ఏనాటికైనాసరే. మా ఇంటికి ఆహ్వానం పలుకేస్తున్నాను. ఆదినం ఎప్పుడు వస్తుందో అని వెయ్యి కళ్ళతో వేచి యున్నా.

మీ

లక్ష్మి"

పూర్తిగా చదివేసరికి కళ్ళమ్మట నీళ్ళు తిరిగేయి. ప్రపంచక దృష్టిలో తను ఎంత పతనమైపోయి, ఉన్నతి పోగొట్టుకుందో ఎరుకైంది. దాంతో ఏడుపు వచ్చింది.

యథాలోపంగానే. ఆరోజు భోజనం చేస్తూవున్నప్పుడే "నువ్వు పెద్ద పులివా? బ్రహ్మరాక్షసివా?" అని ఆయన అడిగాడు.

"మహమ్మారిని" అని కొపంతో ఒక్కసారి అనెయ్యాలనుకుంది. కాని ఆ ముక్క నోరు పెగిలి రాలేక పోయింది.

• • •

నల్లమందు అలవాటుకు పూర్వం చాలా చిన్న వంతే. ఆవగింజంలో అరసగంతోనే ప్రారంభిస్తుంది. దాంతర్వాత అది కుంకుడుగింజంత అవుతుంది.

ఒక్కరోజు విప్పిన ఉత్తరంలోని విషయంవల్ల, ఇంక ప్రతిరోజూ వచ్చే వుత్తరాలన్నిటిని చదవాలన్న కుతూహలం రేకెత్తితే, చంపుకోలేని నిస్సత్తువులోనే, అన్నీ నెమ్మదిగా ఊడతియ్యడం, చదవడం మళ్ళీ అంటించడం ఓ నిత్యకృత్యం అయ్యింది లలితమ్మకు.

ఈ రెండు మూడు రోజులకు వచ్చిన ఉత్తరాల్లో ఒకటి రెండింట్లో తప్పకుండా తన్ని దుమ్మెత్తి పొయ్యడం. ఆయన్ని ఆదరాభిమానాల్తో ఆహ్వానిస్తూ. ప్రేమ చిదిమిపెడతామని ఆఖరు చెయ్యబడేవి వుండేవి. ఈ బరిదెగించిన యువతీరత్నాల ఉత్తరాలు చూస్తూంటే, ప్రపంచం ఎంత మారిపోయిందో అనుకుంది. తనుకూడా అల్లా మారిపోతే అన్న ఆశ విరిజ అయినా మారలేదు. ఎంచేతనంటే, ఈ నూతనంగా కాలేజీల్లోనుండి బయటికి వచ్చిన వాళ్ళ ఆదర్శాలు, విజ్ఞానాలకంటె తను అలవరచుకున్న అలవాట్లు ఆరాధనలూ కూడా అయిదు సంవత్సరాలు ముందరికి పురోగమించి వున్నాయి కనుక.

క్షణికం. ఈ లక్ష్మి, అనసూయ, అరుంధతి, పద్మిని, సీత వగైరాల బృందంతో ఆఖరైన ఉత్తరాలన్నీ పట్టుకుని "ఏమండీ! వీళ్ళందరి దృష్టిలోనూ కూడా అంత నీచంగా వున్నానా నేను? మీరు కూడా గానితో ఏకీభవిస్తున్నారా?" అని నిలబెట్టాలన్న ఉద్రేకం వచ్చింది. కాని పరోక్షు వచ్చిన ఉత్తరంలోని సంగతులు. అదే రోజున తనకి ఏదో ఓ సందర్భంలో నవ్వగించెయ్యడంతో. ఆ అధి గడుం అన్నది పత్తి తెలివితక్కువ తనంగానే కన్పించింది. అది తన వ్యక్తిత్వానికే లోపం అని తట్టింది.

ఎన్ని తట్టినా, అవన్నీ స్తబ్ధులా వుంచడంతో, ఉత్తరాలు పెచ్చేయి. వ్రాసిన వాళ్ళు పునః విపులీకరించడం, సాగతియ్యడం, అనునయాలు జారీచెయ్యడం, స్వాగతాలు పంపడంతో ఆ నెలంతా నిండిపోయింది. ఆ ఉద్రుతాలు ప్రతీకారాన్ని ప్రోత్సహించేయి లలితమ్మలో.

ఆరోజు కూర్చుని ఉత్తరాల్లో ఇచ్చిన చిరునామాలకి పేరు పేరునా "మీరు గ్రహించినది నే చిత్రించ గలిగినంత రాయిగాయి తనంలోను చాలా కొద్దీ భాగం. ఒక్కసారి ప్రత్యక్షంగా చూచివుంటే ఎంత యమలోకం అనుభవిస్తున్నానో తెలిసివస్తుంది.

స్వానుభవంలో సుఖదుఃఖాల్ని నిర్ణయించడంముఖ్యం ఎంచేతనంటే పరోక్షంగా చేసినవి నిల్వలేవు కనుక. అవి నిరాధారంగాను వుంటాయి.

రేపు ఆదివారం, మాఇంటికి తప్పకుండా రావలసిందని కోరుతున్నా నా ఈ అభిమాన ఆహ్వానాన్ని మన్నిస్తారని ఆశిస్తున్నాను"

అనివ్రాసి పోస్టులోవేసింది. అవన్నీ అయ్యింతర్వాత తీరా కట్ట కట్టుకుని వీళ్ళందరూ వస్తే తనేం చెయ్యాలి అన్న విషయంలో గాభరా కల్గింది. తీరా వాళ్ళతో కలసి ఆయనకూడా, చిత్రవధకు పూనుకుంటే ఇంట్లోంచి లేచి పోవలసేపరిస్థితి వస్తే. అప్పుడు తనంతటతాను ఆకులు పట్టుకోవలసే స్థితిలోకివెళ్ళడం తటస్థించడం తథ్యంఅవుతుంది. ఇది వస్తుందా రాదా? అన్నది నిరుగ్గా చెప్పలేని విషయం.

అయినా. ఇప్పుడు ఆ ఆదివారం కోసం తను వేచి యుండడం కంటే చేసేదేమీ కన్పించలేదు. ఆనాడు తన జాతకాన్కి ఫలితం దశ, అంతర్దశల్తో చెప్పబడితీరాలి. అదేమిటో అన్న ఆందోళన తప్ప ఇంకేమీ పెట్టుకోలేదు.

•  •  •

ఒక్కరైల్లో ఒకే పెట్టిలో. ఒకేవూరునుంచి బయలుదేరి. ఒకే గమ్యస్థానంకు అన్నట్లు ఆ అంచనమునుంచి, ఒకేసారు తనింటికి. తన్నే ప్రత్యేకంగా చూడ్డానికి రావడం పరశురామయ్యను ఉల్లా పల్లా చేసింది. 'ఎందుకు' వచ్చేరు ప్రశ్నకు సమాధానం తనుచేసుకోలేక పోయేడు. చూచాయగా. వాళ్ళ వుత్తరాల్లో వ్యక్తపరచిన ప్రేమని. అనురాగాన్ని. ఆపేక్షని, ఉమ్మడిగా ఇప్పుడు ప్రదర్శించడం ప్రారంభిస్తే, సన్యాసత్వం పుచ్చుకోవలసి వస్తుంది. పైగా లలితమ్మ?

ఖంగారుగానే లోపల్కివస్తూ, వాళ్ళంతా వచ్చేరని, కాస్త కాఫీ తయారు చెయ్యమని బ్రతిమాలినట్లే విన్నవించుకున్నాడు. లంచం అన్నట్లే తాను బజారుకువెళ్ళి ఫలహారం తెస్తాననీ చెప్పేడు.

'ఓసారి! సావిట్లోకి వస్తావా? వాళ్ళందరికి పరిచయం చేస్తాను" అనీ అన్నాడు.

ఆయనలోని ఖంగారుకు నవ్వుకుంది. అందులోనే "ఏమని?" అని కళ్ళతోటే అడిగింది.

పరశురామయ్య నిజంగా దీని విషయం ఆలోచించలేదు. పైగా ఇన్నాళ్ళూ తన కావ్య పఠనంలో ఆవిడని, అన్నమాటలన్నీ గుర్తుకుతిరిగితే. ఈసమయంలో ఎదురు తిరిగి మొరాయిస్తే. నిజంగా చేతులు ఎత్తెయ్యాలి దాసోహం అంటూనే.

చూసేడు ప్లేటుల్లో తీపి ఒకటి, కారంపెట్టి, కోపాల్లో కాఫీ పోస్తుంటే తెల్లబోయేడు. సరిపడట్లుగానే కోపాలు లెఖ్కపెట్టేయి.

"తీసుకు వెళతారా?" కొలుకుల్లోంచి నవ్వింది.

ఆశ్చర్యం తేరుకోలేకనే "జీ హుజూర్!" అన్నాడు. తనకి ఎండలో శ్రమ తప్పించినందుకు.

ట్రేలో కాఫీలు పట్టుకుని ఆవిడా బయల్దేరింది. సావిట్లోకి వచ్చేసరికి. అన్నిజతలు. ఆపాదమస్తకం సమీక్షకు పూనుకున్నారు. ఓ విధంగా సిగ్గు వచ్చింది. వాళ్ళవయస్సుని చూస్తే. తనకు జ్ఞానంలోపే అనుభవాన్కి ఉన్నంతైనా వయస్సు ఉండక పోవడంతో. వాళ్ళ ఎడ అనురాగం కల్గింది. వాళ్ళ పెద్రితనాన్కి బోళాతనాన్కికూడా జాలిపడింది. ఈ పైపై మెరుపు విజ్ఞానానికి నొచ్చుకోనూ నొచ్చుకుంది. వాళ్ళంతా తనవాళ్ళే అన్నట్లు అయిపోయింది.

"కంచిదె నా భాగ్య" అన్నాడు పరశురామయ్య.

అందరూ చెయ్యెత్తి నమస్కారంపెట్టేరు. ఇదమిద్ధం కాని భావాలు, గౌరవం ద్వేషాలమధ్య వాట్లల్లో చిత్రించుకుంది. ఒక్కసారిగా లలితమ్మ ఉక్కిరి బిక్కిరై పోతే యవ్వనంలో కులికి పోయింది. రను పొట్టలు ఎరుపెక్కాయి.

"అమ్మాయిలూ!" అంది. అంతే సిగ్గు పులిమితే లోపల్కి వెళ్ళిపోయింది.

పరశురామయ్య టీక చెప్పలేక మౌనం వహించేసేడు. ఈ గోచీపోసి కట్టిన చీర, మోచేతిల వరకూ రవిక, ఒక్క నల్లపూసలతాడు, చేతికి రెండుమూడు గాజులు, మొఖాన్కి దమ్మిడీ అంతబొట్టుతో లక్ష్మిలా ఉన్న ఈ ఇడలో, తాము నిర్దేశించిన క్రౌర్యం నిబిడీ కృతం అయి వుందా అన్నసందేహం అందరిలోను. రేకెత్తితే, ఒక్కొక్కళ్ళే లోపల్కి వెళుతూ, వస్తూ, సీతాకోక చిలుకలే అయిపోయి, సావిట్లో అలంకరించేసేరు.

అంతసేపూ కూడా లలితమ్మనోరు కుట్టేసిన పెద్దతనంలోనే సదుపాయాలు చూపించేసింది.

రెండుకూరలుతో, పాయసం వగైరాల్తో, అన్నపూర్ణే అయిపోయి, వాళ్ళందరికి ఒక్కసారిగానే. సహపంక్తిగా ఆయనతో కూర్చో పెట్టేసింది.

ఆరాత్రి వాళ్ళు కబుర్లు చెప్పేరు ఆయనతో. ఆయన మాట్లాడేడు. అన్నీ వింది.

నిద్రపోతుంటేనే కలలుగన్నట్లే అయ్యింది ఆరోజు.

• • •

ఒక్కళ్ళూకూడా, ఏదో తప్పిదం చేసినట్లే తన ఎదుటపడి, ఆంక్షలేకుండా మాట్లాడ లేక పోవడం నవ్వు తెప్పించింది లలితమ్మకు. ఈ ఆంక్షలోనే ఆహ్వానపు ఉత్తరాన్నిగూర్చి ఒక్కరూ ఎత్తనేలేదు.

భోజనాలైన తర్వాత తాంబూలాలు వేసుకుంటు నప్పుడే ఆయన, తనకీ ఆయనకీ జరిగిన సిగరెట్టు పోరాటానికి. చిలవలూ పలవలూ అల్లి చాలా మధురంగా వర్ణించేడు. అందరూ కూడా. నవ్వుకుంటూనే విన్నారు.

రః వకీళ్ళల్లా వచ్చిన వాళ్ళపర్యవేక్షణ. అవయవాల్ని చిత్రవధచేసి విజ్ఞానం నేర్చుకునే డాక్టర్లలాగే. తనకవలిక మాట, పొందుగడ. ప్రవర్తనను సమీక్ష చెయ్యడానికి ప్రయత్నించడం కనపడితే. అదీ ఓ విచిత్ర అనుభూతిని కల్గిస్తే. వీళ్ళంతా వాదులుగాను, తను ప్రతివాదిగాను. ఆయన అనే జడ్జీ కోర్టులో తగువు తీర్పు వలసిందిగాను. ప్రయత్నాలు సల్పడం, ఓ చక్కటి శృంగార కావ్యంలాగే తట్టింది.

సబబుగా, సరైన వాతావరణం, అవకాశం ఇవ్వాలి వాళ్ళకు అన్న భావనలోనే ఆ రోజుల్లో, వాళ్ళందర్నీ కూర్చోపెట్టి వరసాగ్గా జడలు వెయ్యడం, పువ్వులు తురమడం, దగ్గరనుండి, ఆఖర్కి నిద్రపోయేవరకూ కూడా చేయవలసిన సపర్యలన్నీ తనే చేసింది. దీంతో అర్థం కాని కుమిలింపు. తప్పిదాల్లో వాళ్ళు ఎండ మావుల్ని చూచిన పాంథుడిలా వుండడం మనస్సును నొవ్వచేసింది ఇంత వెర్రిబావుల పిల్లలు ఎల్లా జీవితంను నిగ్రహిస్తారు. అని జాలిపడింది.

ఒక్కొక్క సమయంలో "ఏం తల్లీ ! నేనంత బ్రహ్మ రాక్షసినా ?" అని అడుగుదామనుకుంది. కాని వయస్సు ఇప్పుడు వాళ్ళ ఎడ కల్గిన అవాజ్య అప్రీతియతకూడా నోరు కుట్టేస్తోంది.

ఆరోజు సినిమాకి కట్టకట్టుకుని వెళ్ళి వచ్చిన తర్వాతనే, భోజనాలదగ్గర "ఏమండీ ! మమ్మల్ని అందర్నీ కూడా తప్పు మార్గాల్లోకి పోయేట్లు దగా చేసేసేరు. దానివల్ల మేం అందరం కూడా వట్టి మూర్ఖులం అయిపోయేం" అంది పద్మిని.

"ఔను" అంది లక్ష్మి.

తక్కినవాళ్ళు తలలూపేరు.

"నేనేం చేసేనమ్మా" ఆయన అమాయకం కరుడు కట్టినట్లే అన్నాడు.

"మమ్మల్ని అందర్నీ వట్టి వాజమ్మల్ని చేసేసేరు. అందుకే అమ్మని వ్రాసేయకూడా ? అవునా కాదా ?"

లలితమ్మ ఊపిరి బిగబట్టేసింది.

"నేనా ?"

"అవును. పైగా అల్లా అడుగుతారేం ! మీరు ఉత్తరాలు వ్రాయలేదా ?"

"లేదే"

అంతా ఓసారి తెల్లబోయేరు. ఆవిడ వ్రాస్తుంటుంది అన్నది. నిస్సందేహంగా ఇప్పుడు సత్యం అయి కూర్చుంది.

లలితమ్మ నెయుగువట్టిస్తూనే "మిమ్మల్ని అందర్నీ ఓసారి చూడాలని, నేనే వ్రాసే" అంది చాలా నెమ్మదిగా.

ఉండేలు దెబ్బ తిన్నట్లు తెల్లబడ్డారు. పరుశురామయ్య కళ్ళప్పగించేడు.

"ఇన్నాళ్ళూ మీరంతా, నన్ను ఓ బ్రహ్మరాక్షసి, మహమ్మారి, పెద్దపులి, రణపెంకి, రాలుగాయి వగైరాల క్రింద జమవేసేరు. అయనా తందానతాన అన్నట్లు కథలు అల్లేడు. మరి ఈనాడు నేను........" ఉద్రేకం ఉక్కిరి బిక్కిరి అయింది. మాట్లాడలేక వూరుకుంది.

పరుశురామయ్య "ఆకథల్లో భార్యలు కాని తమరు కాదు. మహారాణీ !" అన్నాడు.

"మరి...."

గట్టిగా నవ్వుతూనే "దాసోహం ! అడియేన్ దాసోహం.... తోబా, తోబా తప్పయిపోయింది"

అంటే వాళ్ళూ నవ్వేసేరు.

ఒక్కసారి దధి సముద్రం అయిపోయింది. వాళ్ళంతా ఒక్క కంఠం అన్నట్లే"

"అమ్మగార్ని గూర్చి ఇంక ఇల్లాంటి కథలు వ్రాస్తే మేం ఒప్పుకోం" అని ఖండితంగా తీర్పు చెప్పేసేరు.

పరుశురామయ్య వామపక్షం అయిపోవడంతోటే ఆర్ద్రిత అంతా చిలికుతూనే "లలిత నా జీవితంలో ఓ వెలుగు. ఆ వెలుగునే స్ఫటికంలోంచి చూస్తా. ఇంద్ర ధనస్సులు చిత్రిస్తా. అవిడే లేకపోయివుంటే.... ఈనాడు మీరు ఊహించినంత గొప్పవాణ్ణి కాలేకపోయేవాణ్ణి" అనేసేడు.

లలితమ్మ పూర్తిగా సిగ్గుపడిపోయి "చాల్లెండి. ఏదో నన్ను సామాన్యం లిస్టులోనే వేయుండండి" అంటూనే వంటింట్లోకి తుర్రుమంది.

ఒక్కొక్కళ్ళే వెళ్ళిపోయేరు. తను పొదివి పట్టుకునే వాళ్ళ చేతుల్లో రవికల గుడ్డలు, తాంబూలం పెట్టింది. హృదయం నమిలేసినట్లయింది. వాళ్ళ ఎడబాటు.

పరుశురామయ్య. బోసిపోయిన ఇల్లు చూస్తూనే "శ్రీవారు, గోడకుర్చీ వెయ్యమన్నారా? గుంజీలు తియ్యమన్నారా?" అనేసేడు.

రుసరుస లాడుతూనే, వళ్ళో దూర్చుని, గుండెల్లో తలపెట్టి తాదాత్మ్యత పొందింది లలితమ్మ.

• • •

ఒక్కొక్కళ్ళు శుభలేఖల కోసం ఇద్దరూ ఎదురు చూస్తూనే వున్నారు.

